## క్లుప్తంగా

### పారదర్శకంగా సర్వే చేపట్టాలి


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంప్రసాద్

**ఇచ్చోడ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పథకం సర్వేను సిబ్బంది పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో రాంప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని అడేగామ(కె), మాదపూర్, తలమద్రి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతిఇంటికీ వెళ్లి సర్వే వివరాలను సేకరించి ప్రభుత్వం ద్వారా ఇచ్చిన యాప్‌లో నమోదు చేయాలన్నారు.

### నేడు వీటీజీసెట్

**ఇచ్చోడ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వీటీజీ సెట్ పరీక్ష ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు గిరిజన గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన గురుకుల, సాంఘిక సంక్షేమ గురుకుల, జ్యోతిబా పూలే, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలో గిరిజన గురుకుల బాలుర, బాలికల, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల్లో మూడు కేంద్రాల్లో 816 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్, ఆధార్ కార్డు, వాటర్ బాటిల్ వెంట తీసుకోని రావాలని కోరారు.

### కబ్జా అడ్డుకున్నందుకే ఆరోపణ

**ఆదిలాబాద్‌టౌన్:** ప్రభుత్వ పాఠశాల నెం.2 ఎదుట ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నించగా ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో కలిసి గత నెల 27న అడ్డుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హసూర్‌బాను ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో తనపై ఎండీఎం బియ్యం అక్రమంగా తరలించారని తనపై సామాజిక కార్యకర్త పేరిట ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### 14 నుంచి డైట్ మూడో విడత కౌన్సెలింగ్


**ఆదిలాబాద్‌టౌన్:** ఈనెల 14 నుంచి డైట్ కళాశాలలో ప్రవేశం కోసం మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, కిరణ్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 14న సర్టిఫికెట్ల పరిశీలన, 15 నుంచి 17 వరకు వెబ్‌ఆప్షన్లు, 22న సీట్ అలాట్మెంట్, 23 నుంచి 26 వరకు కళాశాలలో చేరిక, 28 నుంచి కళాశాల తరగతులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

### 'ఆశ'లతో సర్వే చేయించొద్దు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఆదిలాబాద్‌టౌన్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారెంటీ పథకం సర్వే ఆశ కార్యకర్తలతో చేయించొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న కోరారు. శనివారం డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌కు ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలతో సర్వే చేయించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రెండు నెలల నుంచి పారితోషికం చెల్లించడం లేదని, దీంతో వారు ఆర్థికంగా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సంఘ బాధ్యులు సుజాత, హారిక, సునీత, తదితరులు పాల్గొన్నారు.

### పప్పు దినుసులతో ఎన్నో ప్రయోజనాలు


మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త రాజశేఖర్

**ఆదిలాబాద్‌టౌన్:** పప్పు దినుసులతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేవీకేలో ప్రపంచ పప్పు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో పప్పు దినుసులను వాడుతుంటామని పేర్కొన్నారు. ప్రొటీన్, విటమిన్‌లతో పాటు అనేక పోషకాలు లభిస్తాయన్నారు. పప్పు దినుసులు పండించడంతో కలిగే లాభాలు, ఉపయోగాలు, యాజమాన్య పద్ధతులు, చీడపీడల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మోహన్‌దాస్, శివచరణ్, పోశాద్రి, సునీల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దరఖాస్తుల్లో పొరపాట్లు

- ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్న బల్దియా సిబ్బంది
- ఇబ్బందికరంగా సర్వర్ సమస్య


ఆన్‌లైన్‌లో వివరాలను సరి చేస్తున్న బల్దియా సిబ్బంది

**కైలాస్‌నగర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అభయ హస్తం ఆరు గ్యారెంటీల్లో భాగంగా మరో రెండు హామీల అమలుకు కార్యచరణ చేపట్టింది. రూ.500కు గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ను అమలు చేసేందుకు అవసరమైన కసరత్తు చేపట్టింది. ఇందుకోసం ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల్లో అర్హుల గుర్తింపునకు ఆదేశించింది. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించే క్రమంలో చాలా మంది దరఖాస్తుల్లో వంటగ్యాస్ సర్వీస్ కనెక్షన్ నెంబర్‌ను తప్పుగా రాసినట్లుగా గుర్తించారు. అలాంటి దరఖాస్తులను క్షేత్రస్థాయిలోకి వెళ్లి సరిచేయాలని ఆదేశించింది. దీంతో బల్దియా సిబ్బంది వాటిని సవరించే పనిలో నిమగ్నమయ్యారు.

**9519 దరఖాస్తుల్లో పొరపాట్లు..**

ఆదిలాబాద్ పట్టణ పరిధిలో 49 వార్డులుండగా ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు గ్యారెంటీల కోసం మొత్తం 48,656 దరఖాస్తులు అందాయి. ఇందులో వంట గ్యాస్ సిలిండర్ కోసం అందిన దరఖాస్తుల్లో 9519 దరఖాస్తుల్లో పొరపాట్లు జరిగినట్లుగా గుర్తించారు. వాటిని సవరించే దిశగా చర్యలు చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని ప్రతీ వార్డుకు ఇద్దరు చొప్పున 98 మంది బల్దియా ఉద్యోగులను ప్రత్యేకంగా నియమించారు. వీరు ఆయా కాలనీ లకు వెళ్లి అక్కడి అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్తలు, మెప్మా రిసోర్సుపర్సన్ల సాయంతో దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తున్నారు. వాటిని ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్‌లో సరిచేస్తున్నారు. గత రెండు రోజులుగా 4000పైగా దరఖాస్తుల్లోని గ్యాస్ వినియోగారు కనెక్షన్ నెంబర్ వివరాలను సవరించారు.

**వివరాల నమోదులో జాప్యం..**

గ్యాస్ కనెక్షన్ నెంబర్‌ను ఆన్‌లైన్‌లోనే ప్రజాపాలన దరఖాస్తుల ప్రకారంగా వివరాలను సరిచేయాల్సి ఉంది. అయితే ఇందుకు సర్వర్ సమస్య ఇబ్బందికరంగా మారింది. తరచూ సర్వర్ మొరాయిస్తుండటంతో వివరాలు సరిచేసేందుకు తీవ్ర జాప్యం జరుగుతుంది. ఒక్కో కనెక్షన్ వివరాలను నమోదు చేసేందుకు పది నుంచి ఇరవై నిమిషాలకు పైగా సమయం పడుతుందని బల్దియా సిబ్బంది చెబుతున్నారు. సర్వర్ సమస్య కారణంగా పలుచోట్ల గంటల తరబడి యాప్ ఓపెన్ కూడా కావడం లేదని తెలిపారు. దీంతో సరిచేసిన వినియోగదారుడి వివరాల నమోదు ఆలస్యంగా సాగుతుందని చెబుతున్నారు. అయితే నిర్దేశించిన గడువులోగా అన్ని దరఖాస్తుల వివరాలను సరిచేస్తామని బల్దియా అధికారులు చెబుతున్నారు.

### సర్పంచు సేవలు మరువలేనివి

**బోథ్:** బోథ్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఇటీవల తన పదవీకాలం పూర్తి చేసుకున్న సురేందర్ యాదవ్‌ను స్థానిక వైద్యులు రవీంద్ర ప్రసాద్, నాయకులు మండల కేంద్రంలో శాలువాతో సత్కరించారు. గ్రామంలో అనేక అభివృద్ధి చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సుభాష్, రమణగౌడ్, ద్యాగాల నారాయణ, దేవిదాస్, వెంకట రమణ, గంగబాబు గౌడ్, రామారావ్, నాయకులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ఆదిలాబాద్‌టౌన్:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని మావల పోలీసుస్టేషన్ ఎస్సై విష్ణువర్ధన్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రవాణాశాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపకూడదని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాల ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దన్నారు. నిబంధనలకు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ సురేశ్, కళాశాల ప్రిన్సిపల్ భరద్వాజ, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాళ్ల దారిని బాగు చేయండి


చేలకు వెళ్లే రాళ్ల దారి

**బోథ్:** మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న పెద్ద వాగుపై గతంలో చెక్‌డ్యాం నిర్మించారు. చెక్‌డ్యాం పక్క నుంచి రైతులు తమ చేలలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెక్‌డ్యాం నుంచి చేలల్లోకి వెళ్లడానికి గతంలో తాత్కాలికంగా దారి ఏర్పాటు చేశారు. ఆ రాళ్ల దారిపై రైతులు నడవలేని పరిస్థితి నెలకొంది. పడించిన పంటను ఇంటికి తీసుకురావడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ చేలల్లోకి వెళ్లేందుకు రోడ్డు వేయాలని కోరుతున్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం


వివిధ వేషధారణలో విద్యార్థినులు

**ఆదిలాబాద్‌టౌన్:** మహిళలు, యువతులు, విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలని మహిళ సాధికార జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ పాఠశాలలో శనివారం మహిళా సాధికార, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటేనే ఇబ్బందులకు గురికాకుండా ఉండవచ్చన్నారు. సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఎవరైనా పోకిరీలు వేధిస్తే 100కు డయల్ చేయాలన్నారు. మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్న పాత్రల్లో విద్యార్థినులు కండ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


బహుమతి అందజేస్తున్న ఎంపీపీ రాథోడ్ సజన్

**నేరడిగొండ:** యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా సర్పంచ్ కప్-2, టీ20 పోటీలను ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. 2024 సీజన్ విన్నర్ హంగ్రీ హంటర్స్ జట్టు, సర్జికల్ స్ట్రైకర్ జట్లు తలపడ్డాయి. విజేతగా హంగ్రీ హంటర్స్ జటు నిలిచింది. వారికి రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. సర్జికల్ స్ట్రైకర్ జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.6 వేలతో పాటు ట్రోఫీని అందించారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ పెంట వెంకట రమణ, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్ రెడ్డి, ఏలేటి దేవేందర్ రెడ్డి, ఆడె వసంత్‌రావు, దావుల భోజన్న, రాథోడ్ సురేందర్, సాబ్లే సంతోష్ సింగ్ పాల్గొన్నారు.

### విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**బోథ్:** ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మెంటల్ వెల్ బిహేవింగ్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక, శారీరక ఒత్తిడిలను తల్లిదండ్రులు గమనించాలన్నారు. విద్యార్థులకు ఉండే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థుల్లో వచ్చే మార్పులపై వారికి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ మెంబర్లు మాధవి, శైలజ, కమల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వసతుల కల్పనకు ప్రత్యేక కృషి


మాట్లాడుతున్న గోవర్ధన్ రెడ్డి

**కైలాస్‌నగర్:** ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో వసతులను కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తామని కళాశాల పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, వెంకట్ అన్నారు. పూర్వ విద్యార్థి సంఘం సమావేశాన్ని శనివారం పట్టణంలోని కళాశాలలో నిర్వహించారు. కళాశాలలోని సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కంప్యూటర్ ల్యాబ్‌కు అవసరమైన కంప్యూటర్లు సమకూర్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు సుహాసిని రెడ్డి, నవీన్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ అచ్చి శ్రీనివాస్, ప్రతాప్ సింగ్, శ్రీకాంత్, మురళీధర్ అధ్యాపకులు, పాల్గొన్నారు.

### షీటీం సేవలపై అవగాహన

**ఇంద్రవెల్లి:** షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలని షీటీం సభ్యులు సుశీల అన్నారు. శనివారం నాగోబా జాతరలో ఆశ్రమ వసతి గృహం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎవరైనా పోకిరీలు వేధిస్తే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు సత్యమోహన్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రణాళికబద్ధంగా చదవాలి

**ఆదిలాబాద్‌రూరల్:** పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని ఐటీడీఏ జీసీడీవో ఛాయా అన్నారు. శనివారం మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతులను పరిశీలించారు. సమయం వృధా చేయకుండా మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమాకాంత్

**తలమడుగు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. చిన్నారులు చిట్టి చేతులతో చేసిన వివిధ రకాల వంటలను రుచి చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమాకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యార్థుల సమయాన్ని వృథా చేయకుండా వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఇందులో ఎస్సై ధనశ్రీ, ప్రధానోపాధ్యాయుడు వెంకట రమణ, వినోద్‌రెడ్డి, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

### కఠినంగా శిక్షించాలి

**ఎదులాపురం:** ఖానాపూర్ పట్టణం శివాజీనగర్‌లో చోటు చేసుకున్న ప్రేమోన్మాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ జిల్లా నాయకులు జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవనంలో శనివారం మాట్లాడారు. అలేఖ్యను అత్యంత కిరాతకంగా హతమార్చిన శ్రీకాంత్, అతనికి సహకరించిన ఆయన కుటుంబసభ్యులను శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు ఆత్రం వినోద్, అశోక్, సాయికుమార్, అనిల్, గజ్జు, రవీందర్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

**తాంసి:** భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను నిర్వహించారు. శనివారం విగ్రహన్ని గ్రామస్తులు డప్పుచప్పులతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. పండితుల సమక్షంలో అర్చన, నవగ్రహ పూజ, హోమం నిర్వహించారు. అనంతరం విగ్రహనికి భక్తుల సమక్షంలో జలాధివాసం నిర్వహించారు. ఆదివారం వేకువజామున శివలింగాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# విద్యారంగానికి నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న కేశవ్

**ఆదిలాబాద్‌టౌన్:** బడ్జెట్ సమావేశాల్లో విద్యా రంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి పెద్ద పీట వేయాలని కోరారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత ప్రభుత్వం విద్య రంగానికి తుంగలో తొక్కిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యా రంగానికి పెద్దపీట వేసి ప్రభుత్వ విద్య సంస్థలను కాపాడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలలో, సోషల్ వెల్ఫేర్ కస్తూరిబా ఆశ్రమ పాఠశాలలో కాస్మోటిక్స్ నిధులు విడుదల చేయాలన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తానని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. సమావేశంలో జిల్లా నాయకులు స్వాతి, మౌనిక, స్వప్న పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పని చేద్దాం


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్

**గుడిహత్నూర్:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పిలుపునిచ్చారు. స్థానిక శివకల్యాణ మండపంలో శక్తి వందన్ అభియాన్ రాష్ట్ర సమన్వయకర్త చిట్యాల సుహాసినిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన శక్తి వందన్ వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమాల్లో ప్రతీ కార్యకర్త భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, పథకాలు ప్రతీ ఓటరుకు వివరించాలన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుందామన్నారు. సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. శక్తి వందన్ అభియాన్‌తో పార్టీలో మహిళల భాగస్వామ్యం పెంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్ భోయార్, ఇచ్చోడ జెడ్పీటీసీ బాబారావ్, మాధవ్‌రావ్, ఆడే మానాజీ, కేంద్రే లక్ష్మణ్, ఎంపీపీ భరత్ పాల్గొన్నారు.

# అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న జిట్టా రిత్విక్

**బోథ్:** విశ్వం స్కూల్ లాబ్స్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రలోని దీక్ష జూనియర్ కళాశాలలో నిర్వహించిన అబాకస్ వేదిక్ మాథ్స్ పోటీల్లో బోథ్ మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాల విద్యార్థి జిట్టా రిత్విక్ స్టార్ జూనియర్ లెవల్ 1లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. ఈనెల 25 జరిగే స్టేట్ లెవల్ పోటీలకు ఎంపికయ్యాడు. కాగా పోటీల్లో పాల్గొన్న ఎం. భావి ప్రాజ్, బి. తన్వి, శ్రేహిత్, హర్షితలు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు.

**నేరడిగొండ:** అబాకస్ అండ్ వేదిక్ మ్యాథ్స్ అనే అంశంపై ఈనెల 25న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో విశ్వం స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రెయిన్‌బో పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్.విక్రమ్ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఎంఈవో భూమారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కొప్పుల ప్రకాష్, విశ్వం బృందం సభ్యులు, విద్యార్థి తల్లిదండ్రులు అభినందించారు.

# గత పాలకుల నిర్లక్ష్యంతోనే అభివృద్ధికి దూరం


మాట్లాడుతున్న రాంకిషన్ నాయక్

**తలమడుగు:** గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి దూరంగా ఉందని కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు, పరిశ్రమల శాఖ రిటైర్ జనరల్ మేనేజర్ జాదవ్ రాంకిషన్ నాయక్ అన్నారు. శనివారం తలమడుగు మండల కేంద్రంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రైల్వేలైన్ల నిర్మాణాల ప్రతిపాదనల తప్పా ప్రారంభోత్సవాలు లేవన్నారు. యూనివర్సిటీ లేక అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని అన్నారు. మూతపడిన సిమెంట్ పరిశ్రమను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. టికెట్ తనకు లభిస్తే భారీ మెజార్టీతో గెలుస్తానన్నారు. అంతేకాకుండా ఆదిలాబాద్ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రకాష్ రావు, వెంకట్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### రేపు మార్కండేయ జయంతి

**కైలాస్‌నగర్:** మార్కండేయ జయంతి వేడుకలను ఈనెల 12న ఆదిలాబాద్ పట్టణం హమాలివాడలోని ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజు, సాయి ప్రశాంత్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు మహా రుద్రాభిషేకం, 9గంటలకు స్వామి వారి పల్లకి ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### పరామర్శ

**కైలాస్‌నగర్:** ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త లాంటెలి మహేశ్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పరామర్శించారు. మహేశ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని పట్టణంలోని శంకర్ గుట్టలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ధమ్మాపాల్, వాస్ దత్తు, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

### నిధులు ఖర్చు చేయాలి

**ఎదులాపురం:** 2024–25 ఓటాన్-అకౌంట్ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,75,891 కోట్లను ప్రవేశపెట్టడం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఒక ప్రకటనలో అన్నారు. వివిధ సంక్షేమ పథకాలు, శాఖలకు కేటాయించిన ఆయా నిధులను దారి మళ్లించకుండా ఖర్చు చేయాలని కోరారు. దత్తత జిల్లాకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి నిధులను కేటాయించలేదన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

### తహసీల్దార్ స్వాతి బదిలీ

**కైలాస్‌నగర్:** ఆదిలాబాద్ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బి.స్వాతిని ప్రభుత్వం నిర్మల్ జిల్లాకు బదిలీ చేసింది. ఆమె స్థానంలో నిర్మల్ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న సీహెచ్.సత్యనారాయణను నియమించింది. ఈమేరకు రాష్ట్ర భూ పరిపాలన శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు.

### సర్టిఫికెట్లు అందజేత

**బేల:** మండల కేంద్రంలో వివిధ కోర్సులలో శిక్షణను పూర్తి చేసుకుని ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు శనివారం జన శిక్షణ సంస్థ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రోగ్రాం అధికారి వర్ని సంతోష్, పంచాయతీ కార్యదర్శి గట్లేవార్ గజానన్‌తో కలిసి ఆ సర్టిఫికెట్లను అభ్యర్థులకు అందజేశారు. కార్యక్రమంలో కారోబారి కల్యాణ్‌కార్ గజానన్, టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం టీచర్లు పాల్గొన్నారు.

### క్రీడా స్ఫూర్తి చాటిన బీజీఆర్

**ఆదిలాబాద్:** క్రీడాకారులకు రవాణా నిమిత్తం ఆర్థిక సాయం అందించి ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి తన క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు. మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహిస్తున్న సర్కార్ ఛాలెంజ్ కప్ ఆల్ ఇండియా హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారుల వద్ద రవాణా చార్జీలు లేకపోవడంతో స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంకు చేరుకుని రవాణా చార్జీలు అందించారు. ఖేలో ఇండియా హాకీ కేంద్రం నిర్వాహకుడు శ్రీనివాస్, మేనేజర్ ఎజాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.